నేడు ప్రజావాణి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఉప కమిషనర్ డాక్టర్ రవికుమార్ తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజావాణి అందుబాటులో ఉంటుందన్నారు. సర్కిల్ పరిధిలోని ఐదు డివిజన్లకు చెందిన ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికితీసుకురావాలని సూచించారు. జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది ఈ ప్రజావాణి కార్యక్రమానికి హాజరవుతారని... అక్కడికక్కడే సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తారని వెల్లడించారు.

వడ్డెరల సంక్షేమానికి కృషి



వడ్డెర సంఘం సభ్యులు

రాజేంద్రనగర్: వడ్డెర కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రణాళికాబద్ధంగా పరిష్కరించి... సంఘాన్ని అభివృద్ధి చేస్తానని శ్రీ వెంకటేశ్వర వడ్డెర సంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన వేముల శ్రీనివాస తెలిపారు. రాజేంద్రనగర్ వడ్డెర సంఘం సభ్యులు వేముల శ్రీనివాసని అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు శ్రీనివాస మాట్లాడుతూ... తనపై నమ్మకంతో వడ్డెర సంఘం బాధ్యతలు అప్పగించిన వడ్డెర సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘంలో ఉన్న ప్రతి సభ్యుడు సంఘం అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు దండుగుల శ్రీనివాస, వినోద్, జనరల్ సెక్రటరీ గుంజ రాజు, కోశాధికారి రవి, ఆర్గనైజర్ శ్రీను, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సులేమాన్‌నగర్‌లో ఇఫ్తార్



ఇఫ్తార్‌లో పాల్గొన్న కార్పొరేటర్ నవాజుద్దీన్ అహ్మద్ తదితరులు

అత్తాపూర్: సులేమాన్‌నగర్ డివిజన్‌లో ఆదివారం సాయంత్రం ముస్లింలు ఇఫ్తార్ విందు నిర్వహించారు. ముఖ్య అతిథిగా డివిజన్ కార్పొరేటర్ నవాజుద్దీన్ అహ్మద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో ఏరియా ప్రెసిడెంట్ షేక్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

సండే..సందడి



చార్మినార్: పాతబస్తీలోని పర్యాటక స్థలాలన్నీ ఆదివారం సందర్శకులతో కిటకిటలాడాయి. చార్మినార్, మక్కామసీదు, గుల్జార్‌హౌజ్, పత్తర్‌గట్టి, మదీనా, నయాపూల్, సాలార్‌జంగ్ మ్యూజియం, హెచ్‌ఈహెచ్ నిజాం మ్యూజియం, చౌమహల్లా ప్యాలెస్‌లతో పాటు జూ పార్కు తదితర ప్రాంతాలన్నీ సందడిగా కనిపించాయి. సందర్శకులు పెరగడంతో చిరువ్యాపారాలకు గిరాకీ పెరిగింది. రంజాన్ మార్కెట్ సందర్భంగా వినియోగదారులు అధిక సంఖ్యలో చార్మినార్‌కు చేరుకోవడంతో కాలినడకకు కూడా అవకాశం లేకుండా పోయింది. నడిచి వెళ్లేందుకు కూడా చోటు లేకపోవడంతో సందర్శకులు నడిరోడ్డుపైనే ముందుకు వెళ్లారు.

గోల్కొండ కోటలో..

గోల్కొండ: పర్యాటక ప్రాంతమైన గోల్కొండ కోట ఆదివారం పర్యాటక శోభను సంతరించుకుంది. సెలవు రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కోటలో యువకులు, యువ జంటలు కోటలోని ఫిరంగులు, రామదాసు బంధీకానా, ఆయుధాగారం, రాణీ మహల్ తదితర ప్రాంతాల్లో సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు.

నీటి కోసం ఎంత కష్టం!

- వాడవాడలా పెరుగుతున్న తాగునీటి కష్టాలు
- పలు ప్రాంతాల్లో రోడ్డెక్కుతున్న ప్రజానీకం
- వేసవి ముంచుకొస్తున్నా నివారణ చర్యలు శూన్యం
- అధికారుల వైఖరిపై సర్వత్రా నిరసనలు



అత్తాపూర్‌లో కొనసాగుతున్న వాటర్ ప్లాంట్

అత్తాపూర్: రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో తాగునీటి కష్టాలు తీవ్రరూపం దాలుస్తున్నాయి. వేసవి ప్రారంభంలోనే ఇలా ఉంటే నడి వేసవిలో పరిస్థితి ఎంత తీవ్రంగా ఉంటుందోననే ఆందోళన సర్వత్రా వ్యక్తం అవుతోంది. ప్రధానంగా రాజేంద్రనగర్ పట్టణ పరిధిలో తాగునీటి సమస్య తీవ్ర రూపం దాలుస్తోంది. నివారించాల్సిన యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- ◆ బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పద్మశ్రీహిల్స్ కాలనీలో నీటి సమస్య తీవ్రం కావడం.. పట్టించుకోని అధికారుల వైఖరిని నిరసిస్తూ కాలనీవాసులు ఆందోళన నిర్వహిస్తున్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం మహిళలు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. అలాగే రిలే నిరాహార దీక్షలను సైతం ప్రారంభించారు. వేసవి ప్రారంభంలోనే నీటి కోసం ఆందోళనలు వ్యక్తం కావడం దేనికి సంకేతమో అంటూ పలు ప్రాంతాల ప్రజానీకం అనుమానాలను వ్యక్తం చేస్తోంది.
- ◆ వేసవి వచ్చిందంటే చాలా ప్రాంతాల్లో నీటి సమస్య మరింత జఠిలంగా మారుతోంది. హైదర్‌గూడ, అత్తాపూర్, శివరాంపల్లి, బుద్వేల్, రాజేంద్రనగర్ తదితర ప్రాంతాల్లో వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్‌లు, ఆర్వో ప్లాంట్లు విస్తరంగా వెలిశాయి. బోరు నీటిని ఈ ప్లాంట్ల సాయంతో తాగునీటిగా మార్చి 20 లీటర్ల బబుల్ రూ. 20 నుంచి రూ. 30 వరకు విక్రయిస్తున్నారు.
- ◆ కాలం చెల్లిన ఫిల్టర్లు వాడుతూ నీటిని విక్రయించేవారూ లేకపోలేదు. కాలం చెల్లిన ప్లాస్టిక్ డబ్బాలను ఉపయోగిస్తున్నారు. ఏ ట్రీట్మెంట్ ప్లాంట్లోనైనా ప్రమాణాలు పాటించకుండా నిర్వాహకులు విక్రయాలు చేస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు.
- ◆ మూసీ పరీవాహక ప్రాంతంలో నుంచి బోర్ల ద్వారా తెప్పించిన నీటిని ఉపయోగిస్తున్నారు. పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడం శివరాంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల అవసరాల కోసం వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. పాఠశాల విద్యార్థులకు అందించడంతో పాటు స్థానిక వర్గాలకు నామమాత్రం ధరలకు మంచినీటిని అందించాల్సి ఉంది.
- ◆ నిర్వాహకులు వ్యాపారంగా మార్చుకొని ఎక్కువ రేటుకు విక్రయించడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రమాణాలు పాటించని వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్లపై సంబంధిత అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



ఆటోల్లో తరలిస్తూ...



ట్యాంకర్ల ద్వారా మినరల్ వాటర్‌ను సప్లై చేసేందుకు...

నీటి సమస్యపై కొనసాగుతున్న రిలే దీక్ష

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సన్‌సిటీ పద్మశ్రీహిల్స్ కాలనీ వాసులు రెండవ రోజు మంచినీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సన్‌సిటీ ప్రధాన రహదారి వరకు ర్యాలీగా వచ్చి రోడ్డుపై ఆందోళన చేపట్టారు. పలువురు కాలనీ మహిళలు ప్రభుత్వానికి వ్యతిరకంగా ఖాళీ బిందెలతో వచ్చి నినాదాలు చేశారు. మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని గతంలో ర్యాలీలు, నిరసన కార్యక్రమాలు చేపట్టామని బాధితులు పేర్కొన్నారు. ప్రస్తుత వేసవిలో మంచి నీటి సమస్య తీవ్రంగా ఉన్నందున వెంటనే తమకు తాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అక్కడికి చేరుకొని పద్మశ్రీహిల్స్ కాలనీ వాసులతో మాట్లాడారు. వెంటనే వారి సమస్యను పరిష్కరించేందుకు అధికారులతో మాట్లాడారు. కాలనీవాసులకు వారం రోజుల్లో మంచినీటి సమస్య పరిష్కారం అవుతుందని హామీ ఇచ్చారు.

దీక్షకు బీజేపీ మద్దతు...

బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ సన్‌సిటీ పద్మశ్రీహిల్స్‌లో స్థానికులు మంచినీటి సమస్య పరిష్కారం చేపడుతున్న నిరాహార దీక్షకు బీజేపీ మద్దతు తెలిపింది. దీక్ష చేపడుతున్న వారిని రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ పార్టీ ఇన్‌చార్జి తోకల శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించి వారికి మద్దతుగా నిలిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గడచిన పది సంవత్సరాలుగా ఈ సమస్యపై కాలనీ వాసులు ప్రభుత్వానికి అనేకమార్లు వినతిపత్రాలు అందజేసిన ఏ ఒక్కరూ పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే సైతం తాగునీటి సమస్య పరిష్కారంపై దృష్టి సారించాలని హితవు పలికారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రజలు తగిన గుణపాఠం చెబుతాని హెచ్చరించారు. వారం రోజుల్లో సమస్యకు పరిష్కారం రాకపోతే సహించేది లేదని ఎంత దూరమైనా వెళ్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ ప్రెసిడెంట్ మహేష్‌యాదవ్, నీరుడు శేఖర్‌ముదిరాజ్, నేతలు నరేష్, గోపి, నవీన్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, పవన్, సాయి, రాజు లంకల సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దీక్ష చేస్తున్న వారితో మాట్లాడుతున్న ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్



మహిళలతో మాట్లాడుతున్న బీజేపీ రాజేంద్రనగర్ ఇన్‌చార్జి తోకల శ్రీనివాస్‌రెడ్డి

సమాజ పురోగతిలో మహిళల పాత్ర అద్వితీయం



మహిళా దినోత్సవంలో పాల్గొన్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, మహిళలు

మైలార్‌దేవ్‌పల్లి: మహిళలు కుటుంబాన్ని, సమాజాన్ని ముందుకు తీసుకువెళ్లడంలో ముఖ్య భూమిక పోషిస్తారని బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆరాంఘర్ చౌరస్తాలోని న్యూ ప్రిన్స్ ప్యాలెస్‌లో ఆదివారం సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలతో కలిసి ఆయన కేక్ కట్ చేశారు. మహిళలు తమ ప్రతిభ, నైపుణ్యాలతో దేశంలో అన్ని రంగాల్లో రాణించడం శుభ పరిణామం అని ఆయన పేర్కొన్నారు. మహిళలందరూ అన్ని రంగాల్లో రాణించడమే కాకుండా ఇతరకు ఉపాధినీ కలిప్తిస్తున్నారన్నారు. మహిళా శక్తి చాలా గొప్పదన్నారు. మహిళా అధ్యక్షురాలు ఉడుత లక్ష్మి, అంగన్‌వాడీ, మహిళా గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

అనారోగ్యం తాళలేక వ్యక్తి ఆత్మహత్య

మణికొండ: అనారోగ్యంతో కొంత కాలంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్న ఓ వ్యక్తి ఇంట్లో ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని హైదర్‌షాకోట్, హిమగిరినగర్ కాలనీలో ఆదివారం జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... ఉపాధి నిమిత్తం నగరానికి వచ్చి హైదర్‌షాకోట్‌లో స్థిరపడిన రాజు(50) కొంత కాలంగా అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నారు. పలు ఆస్పత్రులలో చికిత్స తీసుకున్న నయం కాకపోవటం, మరింత పెరిగిపోతుండటంతో ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతని బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ప్రతి ఆలయం, మసీదుకు ఒక కానిస్టేబుల్



లంగర్‌హౌస్: పుకార్ల భయం తొలగిస్తూ, శాంతి భద్రత పరిరక్షణ కోసం ప్రతి ఆలయం, మసీదులకు ఒక కానిస్టేబుల్‌ను నియమించడం అనివార్యమని ఏసీపీ సయ్యద్ ఫయాజ్, ఇన్‌స్పెక్టర్ రఘుకుమార్ అన్నారు. లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆలయాలు, మసీదులకు కానిస్టబుళ్లను నియమించారు. ఈ సందర్భంగా ఆలయాలు, మసీదుల నిర్వాహకులతో ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ సయ్యద్ ఫయాజ్, ఇన్‌స్పెక్టర్ రఘుకుమార్ మాట్లాడుతూ..ప్రతి ఆలయం, ప్రార్థనా మందిరానికి ఒక్కో కానిస్టేబుల్‌ను నియమించామన్నారు. ఈ కానిస్టేబుల్ నిత్యం నిర్వాహకులకు అందుబాటులో ఉంటూ, రెండు రోజులకు ఒకసారైనా కచ్చితంగా వారిని కలుస్తారన్నారు. ఆయా ప్రాంతాల్లో ఏదైన సమస్యలు తలెత్తినా, అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా, ఇబ్బందికర ఘటనలు చోటుచేసుకున్నా నిర్వాహకులు వెంటనే ఆ సంబంధిత కానిస్టేబుల్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు రాజు, రాఘవేంద్ర పాల్గొన్నారు.

మహిళలకు సత్కారం



వివిధ రంగాల్లో సేవలందిస్తున్న మహిళలను సత్కరిస్తున్న దృశ్యం

మైలార్‌దేవ్‌పల్లి: రాజేంద్రనగర్ నియోజకవర్గం మానవ సేవే మాధవ సేవా సంస్థ, శ్రీ మార్కండేయ పద్మశాలి ట్రస్ట్ సహకారంతో భావన ఋషి నగర్ ట్రస్ట్ భవనంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. వివిధ రంగాల్లో విశేష సేవలందరిస్తున్న సేవా భారతి మహిళలు, అంగన్‌వాడీ టీచర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య మహిళా సిబ్బంది, ఆశావర్కర్లను ఘంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సమాజ సేవలో భాగం కావడాన్ని తాము ఎంతో సంతోషంగా.. బాధ్యతగా భావిస్తున్నామన్నారు. మహిళా శక్తిని ప్రోత్సహించేలా మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని మానవ సేవే మాధవ సేవా సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. నిర్వాహకులు, స్థానిక నేతలు కాశీ గారి యాదగిరి, రాపోలు సత్తయ్య, సంస్థ చైర్మన్ ఏర్వ కుమార స్వామి, కొంపల్లి జగదీష్, రమేష్‌రెడ్డి, దొంత రాజు, గోంత్యాల శ్రీనివాస్, సామల యాదయ్య, సిద్ధిరాల రాజ్‌కుమార్, హేమలత, మీనాక్షి, లక్ష్మి, చంద్రకళ, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

'ఫెడరేషన్' అధ్యక్షుడిగా వంశీ



ఫెడరేషన్ కార్యవర్గ సభ్యులు

మణికొండ: ఆల్‌కాలనీస్ రెసిడెన్షస్ వెల్ఫేర్ అసోసియేషన్స్ ఆఫ్ ఫెడరేషన్ మణికొండ మున్సిపాలిటీ నూతన అధ్యక్షుడిగా అలకాపూర్ టౌన్‌షిప్ అధ్యక్షుడు వంశీ 26 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. హుడా కాలనీకి చెందిన డి.సీతారాందాస్ ఆయన చేతిలో ఓటమి పాలయ్యారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ఫెడరేషన్ కొన్ని పర్యాయాలుగా ఏకగ్రీవంగా జరిగే ఎన్నిక ఈ సారి పోటీ ఏర్పడటంతో ఎన్నికలు నిర్వహించారు. పురుష ఉపాధ్యక్ష స్థానాలు నాలుగు ఉండగా వాటికి ఆరుగురు పోటీలో నిలిచారు. దాంతో వారికి ఎన్నికలు జరగగా అందులో భాగ్యలక్ష్మి కాలనీకి చెందిన వి. ప్రభాకర్‌రెడ్డి 72 ఓట్లు, కేపీఆర్ కాలనీకి చెందిన జి.సింహ రాజిరెడ్డి 61 ఓట్లు, ఎంప్లాయిస్ కాలనీకి చెందిన జి.గోవర్ధన్‌రెడ్డి 55 ఓట్లు, హుడా కాలనీకి చెందిన ఎస్‌బీ రాజశేఖర్ 46 ఓట్లు రావటంతో గెలుపొందారు. ఎం.కృష్ణకుమార్‌కు 40 ఓట్లు, వేముల శ్రీధర్‌కు 36 ఓట్లు రావటంతో వారు ఓటమి పాలయ్యారు.

మిగతా స్థానాలు ఏకగ్రీవం...

ఆల్‌కాలనీస్ ఫెడరేషన్ ఎన్నికల్లో అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు ఎన్నికలు జరగగా మిగతా పదవులకు నామినేషన్లు సరిపడా స్థాయిలోనే రావటంతో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మహిళా ఉపాధ్యక్షురాలిగా తోట ప్రవీణ, ప్రధాన కార్యదర్శిగా వి. ఆంజనేయులు, సంయుక్త కార్యదర్శులుగా జె.రామస్వామి, పి.రాజలింగం, కె.వెంకటేశ్వర్‌రావు, ఆర్.బాబురావు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా బి.కృష్ణారెడ్డి, ఎం.కిషన్‌రెడ్డి, వి.శంకర్‌దేవ్, వై.కిరణ్, కోశాధికారిగా నల్లా రవీందర్‌రెడ్డిలు ఏకగ్రీవంగా ఎన్నికయినట్టు ఎన్నికల అధికారులు ఎం.సత్యానారాయణమూర్తి, బీవీ సత్యనారాయణ తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి...

మణికొండ మున్సిపాలిటీ పరిధిలో ప్రజలందరు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారానికి ఆల్ కాలనీస్ ఫెడరేషన్ కృషి చేస్తుందని అధ్యక్షుడు వంశీ, ప్రధాన కార్యదర్శి వి.ఆంజనేయులు తెలిపారు. ఎన్నికల ఫలితాల అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ... మున్సిపాలిటీ పరిధిలో సరిపడా తాగునీరు, లింక్‌రోడ్లు, దోమలు, చెరువుల అభివృద్ధి, కాలుష్యం తదితర ప్రాధాన సమస్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులను కలిసి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



గోల్కొండ: సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఆయన టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో కార్వాన్, నానల్‌నగర్, లంగర్‌హౌస్ డివిజన్‌లకు చెందిన పలువురికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎంఆర్‌ఎఫ్ పథకం వల్ల నిరుపేదల శాస్త్ర చికిత్సలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం ఆయన తన కార్యాలయానికి వచ్చిన వారితో మాట్లాడి వారి ఫిర్యాదులను విన్నారు. నల్లాల్లో వస్తున్న నీరు లోప్రెజర్‌తో వస్తుందని ఫిర్యాదు చేశారు. గోల్కొండలోని పలు ప్రాంతాల్లో నల్లాల్లో నీరు 20 నిమిషాల కంటే ఎక్కువ రావడం లేదని వస్తున్న నీరు తాగునీటి అవసరాలకే సరిపోతుందని ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ..కార్వాన్ నియోజకవర్గంలో నీటి సరఫరాలో సమస్యలు ఉన్న ప్రాంతాలను గుర్తించామన్నారు. వారం రోజుల్లో ఆ సమస్యలను పరిష్కరిస్తామని పేర్కొన్నారు. అలీముద్దీన్, సయ్యద్ రఫత్ హుస్సేన్ తదితరులున్నారు.

ఆస్తి పన్ను వసూళ్లపై ఫోకస్

శంషాబాద్ మున్సిపాలిటీ డిమాండ్ రూ. 25 కోట్లు

- వసూలైంది రూ. 13 కోట్లు
- లక్ష్య సాధనకు అధికారుల కసరత్తు



శంషాబాద్ మున్సిపల్ కార్యాలయం

శంషాబాద్: ఆస్తి పన్ను వసూళ్లపై శంషాబాద్ మున్సిపల్ అధికారులు ఫోకస్ పెట్టారు. ఈ ఆర్థిక సంవత్సరం మరో 22 రోజుల్లో ముగియనుండగా ఇప్పటి వరకు నిర్దేశించిన లక్ష్యంలో సగాన్ని మాత్రమే చేరుకున్నారు. మిగతా సగం వసూలుపై అధికారులు సీరియస్‌గా శ్రమిస్తున్నారు. పట్టణంలో విలీన గ్రామాలను లేనప్పుడు సుమారు రూ. 20 కోట్లకు పైచిలుకు ఆస్తిపన్ను డిమాండ్ ఉండేది. ప్రస్తుతం విలీన గ్రామాలను కలిపిన తర్వాత మొత్తం 20 వేల పైచిలుకు అవాసాలున్నాయి. వీటి మొత్తం ఆస్తి పన్ను డిమాండ్ మొత్తం రూ. 25 కోట్లుగా ఉంది. ఇప్పటి వరకు అధికారులు మొత్తం రూ. 13 కోట్ల ఆస్తిపన్ను వసూలు చేశారు. 22 రోజుల్లో మరో రూ. 12 కోట్ల వసూళ్ల లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నారు.

ప్రధాన ఆధారం...

జీవో 111 కారణంగా శంషాబాద్ పట్టణంలో సాతంరాయి, హుడాకాలనీ, ఎయిర్‌పోర్టు కాలనీ మినహా ఎక్కడా గృహ నిర్మాణాలకు అనుమతి లేదు. గృహ నిర్మాణాల అనుమతి ఉంటే మున్సిపాలిటీ ఆదాయం గణనీయంగా ఉండేది. మున్సిపాలిటీకి ప్రస్తుతం ఆస్తిపన్ను, ట్రేడ్ లైసెన్స్, వినోద పన్ను మినహా మరే ఇతర మార్గాల నుంచి ఆదాయ వనరులు లేకపోవడం పెద్ద సమస్యగా మారింది. దీంతో ఆస్తిపన్ను వసూళ్ల వందశాతం చేరుకోవడం మున్సిపాలిటీకి మనుగడకు తప్పనిసరిగా మారుతోంది. గడచిన నాలుగైదేళ్లుగా నిలిచిపోయిన రిజిస్ట్రేషన్‌ల నుంచి వచ్చే ఆదాయం విడుదల కావడంతో కొంత ఊరట కలిగింది.

పన్నులు చెల్లించాలి

విలీన గ్రామాల్లో ఇప్పటివరకు 75 శాతం పన్నులు వసూలయ్యాయి. బకాయిల వసూళ్ల కోసం చర్యలు తీసుకుంటున్నాం. మొత్తం రూ. 25 కోట్ల డిమాండ్ ఉంది. ప్రస్తుతం రూ. 13 కోట్లకు పైగా వసూలైంది. ప్రజలు ఆస్తి పన్ను సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధిలో భాగస్వాములు కావాలి.

– బి.సుమన్‌రావు, మున్సిపల్ కమిషనర్, శంషాబాద్

క్రీడాకారులను ప్రోత్సహిద్దాం



విజేతలకు ట్రోఫీ, చెక్కులను ప్రదానం చేస్తున్న కార్తీక్‌రెడ్డి

మణికొండ: రాజేంద్రనగర్ నియోజకవర్గంలో మంచి క్రీడాకారులు ఉన్నారని, వారందరినీ ప్రోత్సహించేలా టోర్నమెంట్‌లు నిర్వహిద్దామని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి పి.కార్తీక్‌రెడ్డి అన్నారు. మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు బి.ఉపేంద్రనాథ్‌రెడ్డి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టినరోజున ప్రారంభించిన కేసీఆర్ క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు ఆయన ఆదివారం మణికొండలో ట్రోఫీలు, చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గంలో క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, రెజ్లింగ్, కబడ్డీ, ఖోఖో, బాక్సింగ్ తదితర క్రీడలలో రాణించిన ఎందరో క్రీడాకారులు ఉన్నారన్నారు. వారందరినీ మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. అందుకు అనుగుణంగా రాబోయే రోజుల్లో ఇలాంటి టోర్నమెంట్‌లను మరిన్ని నిర్వహిద్దామన్నారు.

విజేతలు వీరే...

కేసీఆర్ క్రికెట్ టోర్నీలో శ్రీకాంత్ సారథ్యంలోని అల్ఫా 11 టీం మొదటి స్థానంలో నిలిచి ట్రోఫీతోపాటు రూ. 75 వేల నగదు బహుమతి, అజయ్ సారథ్యంలోని ఆరోలియో అవెంజర్స్ టీం రెండవ స్థానంలో నిలిచి రూ. 50 వేలు, రమేష్ సారథ్యంలోని జైహనుమాన్ టీం మూడవ స్థానంలో నిలిచి రూ. 25 వేల నగదు పురస్కారాలను అందుకున్నారు. బెస్ట్ ప్లేయర్‌గా దీపక్‌సింగ్, బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా రమేష్‌సింగ్, బెస్ట్ బౌలర్‌గా మనోజ్, బెస్ట్ ఫీల్డర్‌గా రఘు నిలవటంతో వారికి మెమెంటోలు అందించారు. బీఆర్ఎస్ పార్టీ మణికొండ మున్సిపల్ అధ్యక్షుడు డి. సీతారాం, ప్రధాన కార్యదర్శి జి.నరేందర్, కార్యనిర్వాహక అధ్యక్షుడు కె. ధన్‌రాజ్, నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు కె. విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ప్రోత్సహించిన ఉపేంద్రనాథ్‌రెడ్డి దంపతులను ఘనంగా సత్కరించారు.